నేటి నుంచి ఇందిరమ్మ 'లబ్ధిదారుల' సర్వే

చందానగర్ సర్కిల్‌– 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్: ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు చేరువ దిశగా సాగుతోంది. జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ 21 పరిధిలో దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రారంభిస్తున్నట్లు ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ పరిధిలో సుమారు 10వేల దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. ఇందుకు 32 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అర్హులైన వారందరిని ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేయనున్నామన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఖాళీ స్థలం ఉన్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, ప్రభుత్వ స్థలం, 58,59 జీఓల కింద ఉన్న స్థలాలకు, డబుల్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి వర్తించదని తెలిపారు. గ్రామకంఠం కింద ఉన్న స్థలాలు, పట్టా భూములున్న వారు అర్హులన్నారు. దుతూ ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి అధికారులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరుస్తారని పేర్కొన్నారు. సొంత స్థలం ఉండి, రేకుల ఇళ్లు ఉన్న లబ్ధిదారులను ఎంపిక చేసి, శ్లాబ్ ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరఫు నుంచి ఐదు లక్షల రూపాయల సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాండుగౌడ్, రామకృష్ణ, సత్యనారాయణ, ఏఎంసీకే శ్రీనివాస్, సర్వేయర్లు ముస్తఫా, కుమార్, జయలక్ష్మీ, సుమన్, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అల్విన్‌కాలనీలో సర్వే పరిశీలన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేను సోమవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, యువనేత రామకృష్ణగౌడ్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లా



సర్వేను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులు

హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్, జలవాయువిహార్, భాగ్యనగర్ కాలనీలలో 64 లక్షల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాలనీల అభివృద్ధే ధ్యేయంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. సమతానగర్ కాలనీలో రూ.22 లక్షలతో సీసీ రోడ్డు, జలవాయు విహార్ కాలనీలో రూ.27 లక్షలతో, భాగ్యనగర్ కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాకు మంచి స్పందన వస్తోంది. శ్రీకాళహస్తి చెక్క విగ్రహాలు, జ్యూట్ బ్యాగులు, వెదురు బుట్టలు, మట్టిపాత్రలు, కశ్మీరీ శాలువాలు, కాటన్, పోచంపల్లి, వెంకటగిరి చీరలు అందుబాటులో ఉన్నాయి. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సోమవారం అనూష శ్రీనివాస్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. జతిస్వరం, దశావతార శబ్దం, హిందోళ తిల్లాన అంశాలను కళాకారులు మాన్య, శ్రీలాస్య, హారిక, తన్వి, వైష్ణవి, ఆద్య ప్రదర్శించి అలరించారు. రష్మీ సచ్చిదానంద శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనలో భాగంగా మల్లరి, గణేశ స్తుతి ,కోలాటం, కావడి చిందు తదితర అంశాలను ఆకాంక్ష, అన్య, వేదం, మాన్విత, నమస్వీ, ఆరాధ్య, సహస్ర, సిరి, తదితరులు ప్రదర్శించారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ ఆధ్వర్యంలో పవన్‌కుమార్ కొంపై రాజు శిష్యబృందం జానపద నృత్యప్రదర్శనలతో అలరించారు.

ఆన్‌లైన్ వ్యాపారాల జోలికెళ్లొద్దు

జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో మనం డబ్బులు చెల్లించడమే తప్ప, విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండదని, ఉన్నా.. కేవలం రూ.5 వేల లోపే ఉంటుందని ఆపైన ఎంత పెట్టినా మోస పోయినట్లే అని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధిక లాభాల కోసం ఆశ పడొద్దని.. ఆన్‌లైన్ వ్యాపారాలు, ఇన్వెస్ట్‌మెంట్ల జోలికి వెళ్లకూడదని సూచించారు.సైబర్ నేరగాళ్ల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. నగదు పోగొట్టుకున్న గంట వ్యవధిలో(గోల్డెన్ అవర్) సమాచారం ఇస్తే నగదు జమ అవుతుందని తెలిపారు.

విద్యార్థినులు కరాటే నేర్చుకోవాలి

మూసాపేట: విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని మూసాపేట బాలికల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ అన్నారు. కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన విద్యార్థినులను సోమవారం అభినందించారు. చరణ్ సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో జరిగిన 4వ నేషనల్ లెవెల్ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీలకు బాలికల పాఠశాల నుంచి 16 మంది, బాలుర పాఠశాల నుంచి నలుగురు హాజరయ్యారు. బాలికల పాఠశాలకు 10 బంగారు, 4 రజత, 2 కాంస్య పతకాలు, బాలుర పాఠశాలకు 2 రజత, 2 కాంస్య పతకాలు దక్కాయి. కరాటే మాస్టర్ ప్రేమలత, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సగం, సగం పనులు..
సమస్య మళ్లీ మొదలు..

చాకలివాని కుంటలో పెరుగుతున్న గుర్రపుడెక్క



పూర్తి స్థాయిలో గుర్రపుడెక్కను తొలగించాలంటున్న స్థానికులు

శేరిలింగంపల్లి: సగం..సగం పనులతో సమస్య మళ్లీ మొదటికే వస్తోంది. గుర్రపుడెక్కను కొంతమేర తొలగించి వదిలేయడంతో తిరిగి చెరువంతా వ్యాపిస్తోంది. దీంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరేనని స్థానికులు విమర్శిస్తున్నారు. శేరిలింగంపల్లిలోని చాకలివాని కుంటలో గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించకపోవడంతో సమస్య పునరావృతమవుతోంది. దీనికితోడు దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం నీటి పారుదల శాఖ చాకలివానికుంట అభివృద్ధికి రూ.26 లక్షలు కేటాయించింది. ఆయా నిధులతో చెరువు చుట్టూ ఫెన్సింగ్, కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. కానీ ఆదర్శనగర్ వైపు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్ వేసే సమయంలో వాటిని తొలగించారు. ఉన్న వాకింగ్ ట్రాక్ అంతా చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండిపోయింది. 2021లో జీహెచ్‌ఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో చెరువులోని గుర్రపుడెక్కను తొలగించారు. కానీ తిరిగి యథాస్థితి నెలకొంది. చెరువును అభివృద్ధి చేయాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు

- ఈ ఏడాది జూలై నుంచి ఎఫ్‌టీసీ మిషన్‌తో 4 నెలల పాటు గుర్రపుడెక్కను తొలగించారు.
- కానీ అధికారులు అక్టోబర్‌లో మసీదుబండలోని కుంటకు ఎఫ్‌టీసీ మిషన్‌ను తరలించారు.
- దీంతో రెండునెలల్లోనే తిరిగి గుర్రపుడెక్క విస్తరించింది
- చెరువులలో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు ఉపయోగపడుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు.



గుర్రపుడెక్క తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్, అధికారులు (ఫైల్)

హెచ్‌సీయూ.. వీల్‌చైర్ ఫ్రెండ్లీగా..

వీసీ బీజేరావు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సోమవారం వీల్‌చైర్ సౌకర్యాన్ని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు లాంఛనంగా ప్రారంభించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని అకడమిక్ యూనిట్లు, పరిపాలనాభవనాలు, ఆడిటోరియం, లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లు, గెస్ట్ హౌస్‌లలో ఈ సౌకర్యాన్ని కల్పించారు. అనంతరం వీసీ బీజేరావు మాట్లాడుతూ అన్ని భవనాలను వీల్‌చైర్ ఫ్రెండ్లీగా మార్చాలని అధికారులకు సూచించారు. క్యాంపస్‌లో ఇప్పటికే పలుచోట్ల ర్యాంప్‌లు నిర్మించారని, అన్ని చోట్లా వీల్‌చైర్లు అందుబాటులోఉంచి దివ్యాంగులు సాఫీగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘనశ్యామ్‌కృష్ణ, డిప్యూటీ రిజిస్ట్రార్(ఎస్టేట్ సెక్షన్) ప్రొఫెసర్ వవన్ కుమార్‌పమ్మి, అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లక్డారంలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్

రాయదుర్గం: హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లక్డారం గ్రామంలో వింటర్ స్పెషల్ క్యాంప్‌ను ప్రారంభించినట్లు యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య తెలిపారు. ఆయన సోమవారం హెచ్‌సీయూలో మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజులపాటు లక్డారం గ్రామంలో 40 మంది వాలంటీర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ థీంసింగ్ పర్యవేక్షణలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రజల ఆరోగ్యం, విద్యా సౌకర్యాలు, డ్రగ్స్ నివారణ, సైబర్ క్రైమ్, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రతి వింటర్, సమ్మర్‌లలో క్యాంప్‌లను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా పడిపూజ



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో ఎర్ర లక్ష్మయ్య నివాసంలో సోమవారం నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో వేముల ఆంజనేయులు, బాబు, గణేష్ గౌడ్, సంపంగి యాదగిరి, మర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. ఫిర్యాదులు

చందానగర్: చందానగర్ సర్కిల్ -21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 వినతి పత్రాలు అందగా ఒకటి టౌన్‌ప్లానింగ్ మరొకటి రెవెన్యూ విభాగానికి సంబంధించినవి అని, సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రజలు ఎల్లప్పుడు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని అన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, టీపీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం, పారిశుద్ధ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అంజయ్యనగర్ పార్క్ స్థలాన్ని కాపాడండి

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో పార్క్ స్థలాన్ని కాపాడాలని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి శేరిలింగంపల్లిలో ప్రజావాణిలో



ఫిర్యాదు చేశారు. గచ్చిబౌలి సర్వే నంబర్ 134లో ఎకరన్నర స్థలం పార్క్‌కు వదిలారని, ఆ స్థలంలో సర్కిల్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించారని ఉప కమిషనర్ ముకుంద్‌రెడ్డికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇచ్చిన ఇంటి నంబర్లను రద్దు చేసి పార్క్ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 9 ఫిర్యాదులు అందాయి. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు 3, ఇంజనీరింగ్ 3, శానిటేషన్ 1, రెవెన్యూ సెక్షన్‌కు 2 ఫిర్యాదుల చొప్పున వచ్చాయని అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ప్రజావాణి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కసిరెడ్డి భాస్కర్ రెడ్డి

ధనుర్మాసం ప్రారంభం



మూసాపేట: కూకట్‌పల్లి ఐడియల్ చెరువు కట్ట సమీపంలో ఉన్న శ్రీ గోదా రంగనాస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5.30 గంటల నుంచి సేవా కాలం , పాశుర విన్నపం, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా ఈ నెల 21వ తేదీ గోపూజ, 27వ తేదీ రంగనాథస్వామి అభిషేకం, జనవరి 8న సాయంత్రం 5 గంటలకు దీపోత్సవం ఉంటుందన్నారు.అలాగే 10వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వారదర్శనం, 11వ తేది కూడారై ఉత్సవం, 13వ తేదీ శ్రీ గోదా రంగనాథ స్వామి శాంతి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని ఆలయ కమిటీసభ్యులు తెలిపారు.

యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ

గచ్చిబౌలి: పేద విద్యార్థులకు సేవ చేయడం బాధ్యతగా గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మసీద్‌బండలో జడ్పీహెచ్‌ఎస్‌లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రెటరీ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల తమ టస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, శ్రీనివాస్, సదానంద్‌యాదవ్, ఆంజనేయులు, సాగర్, శ్రీశైలం , అరుణ్‌కుమార్, పద్మ పాల్గొన్నారు.



యూనిఫాం, నోట్ పుస్తకాలు అందిస్తున్న రవికుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

టీహబ్ - న్యూరెలిక్ ఎంఓయూ



ఒప్పందం చేసుకున్న టీహబ్ ఇన్‌చార్జ్ సీఈఓ సుజిత్‌జాగిర్దార్, న్యూ రెలిక్ సంస్థ సీఈఓ అషన్‌విల్లీ తదితరులు

రాయదుర్గం: పరివర్తనాత్మక ఆవిష్కరణలను సృష్టించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీహబ్ ఇన్‌చార్జీ సీఈఓ సుజిత్ జాగిర్దార్ పేర్కొన్నారు.హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో న్యూరెలిక్ సంస్థతో టీహబ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు అవసరమైన వనరులు, మార్గదర్శకత్వం, భాగస్వామ్యాలతో స్టార్టప్‌లకు సాధికారత కల్పించడం జరుగుతుందన్నారు. న్యూరెలిక్ సంస్థ సీఈఓ అషన్‌విల్లీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న తమ కస్టమర్ల అవసరాలను తీర్చడానికి ఈ ఒప్పందం అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టీహబ్, న్యూరెలిక్ సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ యువగళం గ్రేటర్ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



నియామక పత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌గౌడ్

రాయదుర్గం: బీసీ యువగళం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నీరుడి కిరణ్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. బీసీ యువగళం రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌గౌడ్ సోమవారం నగరంలో రాయదుర్గంకు చెందిన కిరణ్‌కుమార్‌కు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీసీ యువతను చైతన్య పరిచేందుకు చిత్తశుద్ధి కృషి చేస్తామన్నారు. బీసీ యువగళంను పటిష్టం చేయడానికి చర్యలు చేపడతామన్నారు.

నిత్యాన్నదానం.. బియ్యం అందజేత



చందానగర్: గంగారం పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్య అన్నదానంకు మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రీతమ్ 1800 కేజీల బియ్యంను ప్రసాదరావు గురుస్వామికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి సంవత్సరం 108 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారనే కోపంతో..

- ఓ బార్ అండ్ కిచెన్‌లో దోపిడీ చేసిన క్యాషియర్
- బొమ్మ తుపాకీతో బెదిరించి రూ.4.5 లక్షలు, ల్యాప్‌టాప్, ఐ ప్యాడ్ దోపిడీ
- కేసును ఛేదించిన రాయదుర్గం పోలీసులు... క్యాషియర్ అరెస్ట్, మరొకరు పరారీలో...



నిందితుడు శుభంకుమార్ నుంచి స్వాధీనం చేసుకున్న బొమ్మ తుపాకీ, నగదు, ల్యాప్‌టాప్


గచ్చిబౌలి: బొమ్మ తుపాకీతో బెదిరించి దోపిడీకి పాల్పడిన ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్టు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం..రాజ్‌భవన్ రోడ్డులో నివాసముండే శ్యామ్ అనిరుధ్ రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలో టీవర్ బార్ అండ్ కిచెన్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9న ఉదయం 6 గంటల సమయంలో ముసుగులు ధరించిన ఇద్దరు ఆ బార్ వద్దకు వచ్చారు. ఒకరు బొమ్మ తుపాకీ, మరొకరు కత్తితో వాచ్‌మెన్ అజిత్‌సింగ్‌ను బెదిరించి అతని వద్ద బార్ తాళం చెవి, సెల్‌ఫోన్ లాక్కున్నారు. బార్‌లోకి ప్రవేశించి లాకర్ తెరిచి నాలుగున్నర లక్షల నగదు, ల్యాప్‌టాప్, ఐ ప్యాడ్ తీసుకొని ఉడాయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బార్‌లోకి దుండగులు వెళ్లిన సీసీ ఫుటేజీలను పరిశీలించారు. డిజిటల్ లాకర్‌ను తెలిసినవారే తీసే అవకాశముందని నిర్ధారణకు వచ్చారు. దర్యాప్తులో వివరాలు సేకరిస్తుండగా, మూడు నెలల క్రితం ఉద్యోగం నుంచి తొలగించబడిన ఒడిశాకు చెందిన క్యాషియర్ శుభంకుమార్ ఆచూకీ లభ్యం కాలేదు. సెల్‌ఫోన్ ఆధారంగా శుభంను అదుపులోకి తీసుకొని విచారించారు. ఉద్యోగం నుంచి తొలగించారనే కోపంతో స్నేహితుడు బిశ్వజిత్ పాండాతో కలిసి దోపిడీ చేసినట్టు అంగీకరించాడు. నిందితుడి నుంచి లక్షన్నర నగదు, ఐ ప్యాడ్, ల్యాప్‌టాప్, బొమ్మ తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. అయితే పాండా ఒడిశాకు పరారైనట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్ పర్యవేక్షణలో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న, డీఐ సతీష్ కుమార్ కేసు ఛేదించారని డీసీపీ తెలిపారు.

డబుల్ ఇళ్లకు ఇంటి నంబర్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరులో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ నివాసులకు ఇంటి నంబర్‌లు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన డబుల్ ఇళ్లలోకి ఇప్పటికే వేలాది మందినివాసముంటున్నారని వారికి ఇంటి నంబర్ ఇస్తున్నామని చెప్పారు. ఆధార్‌కార్డు, ప్రభుత్వం ఇచ్చిన పట్టా, ఇంటి ఫొటో తీసుకొని రావాలని కోరారు. వాటిని ఆన్‌లైన్ చేసి ఇంటిపన్ను విధిస్తున్నట్లు తెలిపారు. దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆ దారి 'జూ'బ్లీహిల్స్..

రోడ్ నంబర్ 45లో ఫ్లై ఓవర్ పిల్లర్లపై జంతువుల చిత్రాలు



ఆ దారిలోకి రాగానే ముందుగా ఓ జింక కనిపిస్తుంది... దాన్ని దాటగానే దాన్నే చూస్తుండే చిరుతపులి.. ఇంకాస్త ముందుకు వెళ్లగానే నక్కి నక్కి చూస్తున్న గుంట నక్కలు.. ఇంకొంచెం ముందుకెళ్తే.. అందాల నెమళ్ళు, బెంగాల్ టైగర్, అవి దాటగానే తిమింగలాలు, జలచరాలు ఇలా చూపు తిప్పుకోకుండా చేస్తుంటాయి... ఏంటిదంతా అనుకుంటున్నారా..? నగర సుందరీకరణలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నం. 45 నుంచి దుర్గం చెరువును కనెక్ట్ చేసే ఫ్లై ఓవర్ పిల్లర్లపై వేసి చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. దీంతో వాహనదారులు సెల్ఫీలు దిగుతున్నారు. – బంజారాహిల్స్









